

స్పెషల్ బీఈడీ మిగులు సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలోని స్పెషల్ బీఈడీ కోర్సులో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అనూరాధ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎడ్‌సెట్-2024 రాసి ర్యాంకు పొందిన అభ్యర్థులు మాత్రమే ఈ కోర్సులో చేరేందుకు అర్హులు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 18వ తేదీలోగా వర్సిటీలోని విద్యా విభాగానికి దరఖాస్తు చేయాలి. అదనపు సమాచారం కోసం స్పెషల్ ఎడ్యుకేషన్ సమన్వయకర్త డాక్టర్ ఎస్‌వీ స్వామినాయుడు (ఫోన్ నెంబరు 91107 22311)ను సంప్రదించాల'ని ఆమె తెలి సూచించారు.

● ఘనంగా బాలల దినోత్సవం


అరసవల్లి చిల్డ్రన్ హోమ్‌లో చిన్నారులతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

బాలల భవిష్యత్.. అందరి బాధ్యత

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): 'బాలలకు ఉజ్వల భవిష్యత్ అందించే బాధ్యత మనందరిపై ఉంది. బాలలంతా పాఠశాలల్లోనే ఉండాలి. వారి హక్కులను పరిరక్షించాల'ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. గురువారం బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక అరసవల్లిలోని చిల్డ్రన్స్ హోమ్‌లో జిల్లా బాలల రక్షణ విభాగం(మిషన్ వాత్సల్య), మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన బాలల హక్కులు, బాలల హక్కుల వారోత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి చిన్నారులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

● కలెక్టర్ మాట్లాడుతూ 'ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలు పెరిగేలా అవకాశాలు కల్పించాలి. బాలల హక్కులను రక్షిస్తూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలి. నేటి బాలలే రేపటి పౌరులని, వారిని తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనదే'నని స్పష్టం చేశారు. అనంతరం ప్రత్యేక దత్తత సంస్థ(శిశుగృహ)ను సందర్శించారు. మౌలిక సదుపాయాల కల్పన కోసం ఇంజనీరింగ్ విభాగం ద్వారా ప్రతిపాదనలు పంపితే, నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, డీసీపీవో కేవీ రమణ, సూపరింటెండెంట్ పుణ్యవతి, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా బాలల దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. వివిధ వేషధారణలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. శ్రీకాకుళం బొంతా వారి వీధిలోని శ్రీకృష్ణార్జున మందిరంలో బాలోత్సవ కమిటీ మిమిక్రీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దేశభక్తి గేయాలు, విచిత్ర వేషధారణ పోటీలు నిర్వహించారు. సుమారు 70 మంది చిన్నారులు పాల్గొని దేశభక్తి గాయాలు ఆలపించారు. గాంధీజీ, నెహ్రూ, భరతమాత తదితర వేషధారణతో ప్రత్యేకా ఆకర్షణగా నిలిచారు.



ప్రతి ఇంటికీ.. జియోట్యాగింగ్

● సచివాలయ ఉద్యోగుల సర్వే ● కుటుంబ యజమాని ఐరిస్ క్యాప్చర్
● అర్హులకు లబ్ధి కలిగించేందుకే ● కమిషనర్లు, ఎంపీడీవోల పర్యవేక్షణ



శ్రీకాకుళం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ప్రతి ఇంటికీ జియోట్యాగింగ్ సర్వే నిర్వహిస్తున్నారు. భౌగోళికంగా అక్షాంశాలు, రేఖాంశాలతో సహా ఫొటోలు తీసి అప్‌డేట్ చేసే పనిలో సచివాలయ సిబ్బంది నిమగ్నమయ్యారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్లు జియోట్యాగింగ్ ప్రక్రియ నిర్వహించేవారు. వారే ఫోన్‌లో ఫొటోలను తీసి సర్వేను పూర్తిచేసి సచివాలయ వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేసేవారు. ఇప్పుడు వలంటీర్ల వ్యవస్థ లేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాస్తవ ఇళ్ల లెక్క ఆధారంగా అర్హులందరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చేందుకు ఈ నెల 8 నుంచి 'హౌస్‌హోల్డ్ జియోట్యాగింగ్ సర్వే' ప్రారంభించింది. ఇందులో భాగంగా ప్రతి ఇంటినీ జియో ట్యాగింగ్ చేయిస్తోంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో 732 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. వాటి పరిధిలో 7,41,914 గృహాలు ఉన్నాయి. సచివాలయ క్లస్టర్ పరిధిలో ఉన్న ఇళ్లకు సిబ్బంది వెళ్లి.. జియోట్యాగింగ్ సర్వే చేస్తున్నారు. కుటుంబ యజమానికి ఫొటో తీసి ఐరిష్‌ను క్యాప్చర్ చేస్తున్నారు. నివసిస్తున్న ఇంటితో కలిపి జీపీఎస్‌తో అను సంధానం చేస్తూ వెబ్‌సైట్‌లో వివరాలు అప్‌లోడ్ చేస్తున్నారు. కుటుంబ యజమాని అందుబాటులో లేకపోతే రేషన్‌కార్డులో ఉన్న కుటుంబ సభ్యుల ఫొటోను తీసి అప్‌లోడ్ చేస్తున్నారు. బుధవారం నాటికి 2,47,406 ఇళ్ల సర్వే పూర్తయి.. వెబ్‌సైట్‌లో ఫొటోలను పొందుపరిచారు. ఇంకా 4,94,508 ఇళ్లకు సర్వే చేసి ఫొటోలను తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంది. నగరం, పట్టణాల్లో మునిసిపల్ కమిషనర్లు, మండలాల్లో ఎంపీడీవోలు ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు.

మొరాయిస్తున్న డివైజ్‌లు..

జియో ట్యాగింగ్ చేస్తున్న సచివాలయ సిబ్బందికి సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. డివైజ్‌లు సరిగా పనిచేయడంలేదు. కొన్నిచోట్ల మొబైల్‌ను ఉపయోగిస్తున్నా.. డేటా అనుసంధానం కాకపోవడం.. తీసిన ఫొటో క్యాప్చర్ అయినా.. నెట్‌వర్క్ సరిగా లేక అప్‌లోడ్ కాకపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని సచివాలయ సిబ్బంది వాపోతున్నారు. దీనివల్ల జియోట్యాగింగ్‌కు సమయం ఎక్కువ పడుతోందని పేర్కొంటున్నారు. ప్రతి రోజూ ఎన్ని ఇళ్లకు సర్వే చేశారనే విషయాన్ని కలెక్టర్ పరిశీలిస్తున్నారు. సర్వే పూర్తయ్యాక ఇళ్లలో నివసిస్తున్నవారి సంఖ్య కచ్చితత్వం కానుంది. మొత్తం లెక్క తేలనుంది.



జనంలోకి.. వన్యప్రాణులు

● ఉద్దానంలో ఎలుగుబంట్ల సంచారం
● పొలం పనులకు వెళ్లాలంటేనే భయం
● వారం రోజులుగా పెద్దపులి కదలికలు
● ఆందోళనలో పరిసర గ్రామాల ప్రజలు



ఇచ్ఛాపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):

అడవుల్లో ఉండాల్సిన వన్యప్రాణులు జనారణ్యంలోకి వస్తున్నాయి. అడవులు అంతరించి పోతుండడంతో.. వన్యప్రాణులు గ్రామాల్లోకి ప్రవేశించి ప్రజలకు తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. ప్రధానంగా ఎలుగుబంట్లు తరచూ ఉద్దానంలో సంచరించి దాడులకు పాల్పడుతున్నాయి. తాజాగా ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాల్లో పెద్దపులి సంచరించిన ఆనవాళ్లు కనపడడంతో ప్రజలు హడలిపోతున్నారు.

ఎలుగులతో భయాందోళన..

● ఉద్దానం ప్రాంతంలో ఎలుగుబంట్లు సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. నాలుగేళ్ల కిందట సోంపేట మండలం ఎర్రముక్కాంలో ఎలుగుబంట్లు దాడి చేసి నలుగురి ప్రాణాలు బలిగొన్నాయి. అలాగే గతేడాది వజ్రపుకొత్తూరు మండలంలో, ఈ ఏడాది మందస మండలం గుణుపల్లిలో ఎలుగుబంట్లు దాడిలో పలువురు ప్రాణాలు కోల్పోయారు.

● గత నెల 25న మందస మండలం ఉద్దానం ప్రాంతమైన సరియాపల్లి, బహాడపల్లి, జంతిబంద పరిసర ప్రాంతాల్లో నాలుగు ఎలుగు బంట్లు గ్రూపుగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేశాయి. జీడితోటల్లో రైతులు పనులు చేస్తుంటారు. తుప్పలు, ముళ్లపొదలు, గడ్డి తొలగించి.. దుక్కులు దున్నుతుంటారు. ఎలుగుల సంచారం అధికమవ డంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

● ఈ నెల 9న సంతబొమ్మాళి మండలం పెద్దతుంగాంలో ఎలుగుబంటి రెండు పిల్లలతో సంచరించాయి. గ్రామస్తులంతా పెద్దఎత్తున కేకలు వేయడంతో అవి సమీపంలో కొండవైపు వెళ్లిపోయాయి. ప్రస్తుతం వ్యవసాయ పనులు జరుగుతుండంతో పొలాలకు వెళ్లేందుకు గ్రామస్థులు భయపడుతున్నారు.

● సరిహద్దులో పెద్దపులి కలకలం..

ఇచ్ఛాపురం సరిహద్దు ప్రాంతంలో పెద్దపులి.. కొద్దిరోజులుగా సంచరిస్తున్న ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి ఐ.రాము, సిబ్బంది ఇటీవల ఇచ్ఛాపురం మండలంలోని పురుషోత్తపురం, కేదారిపురం, ముచ్చింద్ర, బెనుగానిపేట గ్రామాల్లో పర్యటించారు. అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఒంటరిగా రాత్రిపూట పొలాలకు వెల్లరాదని తెలిపారు. ప్రజల ప్రాణాలతోపాటు పశు సంపదనను కాపాడుకోవాలని సూచించారు. పులి జాడ తెలిసిన వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. పెద్దపులి సంచరిస్తుందనే హెచ్చరికలతో సాయంత్రం 5 గంటలు దాటితే ప్రజలు బయటకు వచ్చేందుకు హడలిపోతున్నారు.

దట్టమైన దండకారణ్యం..

జిల్లాలో దట్టమైన దండకారణ్యం ఉంది. తూర్పు కనుమల్లోనే ఎతైన మహేంద్రగిరులు వన్యప్రాణులకు నిలయాలు. ఈ కొండలు ఒడిశా వరకూ విస్తరించి ఉన్నాయి. లక్షల ఎకరాల్లో విస్తరించిన ఈ కొండల్లో పక్షులు, జంతువులకు సమయానుకూలంగా ఆహారంతో పాటు సమృద్ధిగా నీరు లభిస్తుంది. అందుకే ఇక్కడ అరుదైన పక్షులు, ఎలుగుబంట్లు, జింకలు, అడవి పందులు, అలుగులు, నెమళ్లు, అడవి కోళ్ల వంటివి అధికంగా కనిపిస్తుంటాయి. అయితే ఈ మహేంద్రగిరులు (మిగతా 6వ పేజీలో..)


అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచిస్తున్న డీఆర్వో రాము, అటవీశాఖ సిబ్బంది (ఫైల్)

సమ్మెకు సన్నద్ధం

● సమస్యలు పరిష్కరించాలని 108 వాహన సిబ్బంది డిమాండ్
● 25 అర్ధరాత్రి నుంచి సమ్మెబాట

నరసన్నపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో రోగులు, క్షతగాతుల ప్రాణాలు కాపాడడంలో కీలకంగా వ్యవహ రించే 108 వాహన ఉద్యోగులు సమ్మెబాటకు సన్నద్ధమవుతున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. ఈ నెల 25న అర్ధరాత్రి నుంచి సమ్మె చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే కలెక్టర్, (మిగతా 6వ పేజీలో..)


నరసన్నపేట ఎంపీడీవోకు సమ్మె నోటీసు ఇస్తున్న 108 సిబ్బంది



వందేళ్ల 'ఆదివారం' సంత

● నేటికీ దానిపైనే ఆధారపడుతున్న ఉద్దానం ప్రజలు

6లో


పాతపట్నం పోలీస్‌స్టేషన్‌లో సీఐకు ఫిర్యాదు చేస్తున్న కలమట వెంకటరమణ


టెక్కలిలో ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

పోసానిపై చర్యలు తీసుకోవాలి

● శ్రీకాకుళం పార్లమెంటరీ టీడీపీ అధ్యక్షుడు కలమట డిమాండ్
● పాతపట్నంలో పోలీసులకు ఫిర్యాదు

పాతపట్నం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సమాజంలో గౌరవ ప్రదమైన వ్యక్తులపై సినీనటుడు, వైసీపీ నేత పోసాని కృష్ణమురళీ సామాజిక మాధ్యమాల ద్వారా అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని శ్రీకాకుళం పార్లమెంటరీ టీడీపీ అధ్యక్షుడు కలమట వెంకటరమణ పేర్కొన్నారు. పోసానిపై చర్యలు తీసుకోవాలని గురువారం పాతపట్నం పోలీసుస్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు. కలమట మాట్లాడుతూ.. 'ప్రస్తుత సీఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ, ఈనాడు, టీవీ-5 అధినేతలపై, టీడీపీ ఛైర్మన్ బీఆర్ నాయుడుపై సామాజిక మాధ్యమాల్లో పోసాని కృష్ణమురళీ అనుచిత వ్యాఖ్యలు చేశారు. వారి హక్కులకు భంగం కలిగించేలా.. దుర్భాషలాడుతూ కుటుంబ సభ్యులను మానసికంగా హింసించేలా వ్యవహరించారు. హింసాత్మక ధోరణిని రెచ్చగొట్టేలా.. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న ఇటువంటి వ్యక్తులను, ప్రోత్సహిస్తున్న వారిని అదుపులోకి తీసుకోవాలి. విచారణ చేపట్టి వారిపై చర్యలు తీసుకోవాలి' అని సీఐ వి.రామారావును కోరారు. సంబంధిత వీడియో క్లిప్పింగ్‌లను అందజేశారు. ఇప్పటికైనా పోసానితో పాటు వైసీపీ నాయకులు దిగజారుడు వ్యాఖ్యలు విడనాడాలని హితవు పలికారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్రఉపాధ్యక్షుడు పైల లక్ష్మయ్య, మిరియాబిల్లి బాబూరావు, మెళియాపుట్టి మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి ఉర్లాన వసంత్, పడాల తిరుపతిరావు కర్రి అప్పారావు, తెలుగు యువత అధ్యక్షుడు నల్లి లక్ష్మణ్, బచ్చల వసంత్, కనకల నారాయణ, వట్టి కన్నా రావు పాల్గొన్నారు.

టెక్కలి పోలీస్‌స్టేషన్‌లో..

టెక్కలి: తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బీఆర్ నాయుడుపై అసభ్య పదజాలంతో వ్యాఖ్యలు చేసిన సినీనటుడు పోసాని కృష్ణమురళీపై చర్యలు తీసుకోవాలని స్థానిక టీడీపీ నేతలు గురువారం రాత్రి టెక్కలి పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఎ.విజయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోళ్ల లవకుమార్, కామేసు, పోలాకి చంద్రశేఖర్, కోరాడ రాంప్రసాద్, దళిత నాయకులు యడ్ల గోపి ఉన్నారు.

ప్రమాదపుటంచున.. హుద్‌హుద్ ఇళ్లు

కొండపై కంకర అక్రమ తవ్వకాలే కారణం


పలాస, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): హుద్‌హుద్ గృహ సముదాయం ప్రమాదం అంచున ఉంది. ఇక్కడ కంకర అక్రమ తవ్వకాలు చేపడుతుండడంతో.. ఏ క్షణానైనా ఇళ్లు కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 2017లో స్థానిక పారిశ్రామికవాడ వెనుక భాగాన నెమలికొండ అంచున మొత్తం 198 హుద్‌హుద్ గృహాలు నిర్మించారు. ఒక్కో గృహానికి రూ.4.03లక్షలు చొప్పున కేటాయించారు. కాగా.. ఆ గృహాలను ఇప్పటివరకూ లబ్ధిదారులకు అప్పగించకపోవడంతో.. భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. రూ.కోట్ల విలువైన ప్రజాధనం వృథా అవుతోంది. కొండకు ఆనుకుని ఈ గృహాలు నిర్మించడంతో.. ఎవరూ ఈ ప్రాంతానికి రావడం లేదు. ఇదే అదనుగా అక్రమార్కులు కొండపై కంకరను తవ్వకాలు యథేచ్ఛగా చేపడుతున్నారు. కింది భాగాన సుమారు 50 అడుగుల లోతులో కంకరను తవ్వేయడంతో ఆ గృహాలు కూలిపోతాయోమోనని ఈ ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు.

● ఇదిలా ఉండగా ఆ ప్రాంతంలో ఉన్న 33/11 కేవీ విద్యుత్ లైన్లకు సంబంధించి స్తంభాల పక్కన పూర్తిగా కంకర తవ్వేశారు. దీంతో స్తంభాలు సైతం కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు, జీడి పరిశ్రమల యజమానులు పేర్కొంటున్నారు. ఆ ప్రాంతంలో రెండు ఎకరాలకు పైగా అక్రమంగా కంకరను తవ్వినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయని చెబుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి కంకర అక్రమ తవ్వకాలు అరికట్టాలని, ఇళ్ల సముదాయానికి ఇబ్బందులు లేకుండా గోతులు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.


హుద్‌హుద్ ఇళ్ల వద్ద కంకర తవ్వకాలు


మఖరాంపురం సమీపంలో సంతలో విక్రయాలు (ఫైల్)

వందేళ్ల ఆదివారం సంత



వందలాది కుటుంబాలకు ఆధారం..

ఈ ఆదివారం సంత పరిసర గ్రామాల ప్రజల అవసరాలను తీర్చడమే కాకుండా వందలాది కుటుంబాలకు జీవనాధారంగా ఉంది. సోంపేటలోని పొందర, వైశ్య కులాలకు చెందిన పలువురు వ్యాపారులు 40, 50 ఏళ్ల నుంచి సంతలో సరుకులు విక్రయిస్తున్నారు. కొన్ని కుటుంబాలు మాత్రం రెగ్యులర్‌గా కొంతమంది వ్యాపారుల వద్ద మాత్రమే సరుకులు కొనుగోలు చేస్తూ.. ఏళ్లతరబడి ఖాతాదారులుగా కొనసాగుతున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కాకినాడ జిల్లా నుంచి సైతం అరటి గెలలు ఇక్కడకు తెచ్చి విక్రయిస్తుంటారు. నిమ్మకాయలు కూడా ఇతర ప్రాంతాల నుంచే వస్తాయి.

బియ్యం.. బేడలు.. కూరగాయలు.. మాంసం.. ఒకటేమిటి? ఒక్క ఫోన్ కాల్ లేదా ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెడితే గుమ్మం ముందుకే వచ్చేస్తున్న కాలం ఇది. ఇంత పోటీలోనూ వారాంతపు సంతలు ఉనికిని చాటుకుంటున్నాయి. నాటి గ్రామీణ వాతావరణాన్ని నేటి తరానికి కళ్లముందుంచుతున్నాయి. ఇలాంటిదే కంచిలి సమీపంలో జాతీయ రహదారికి ఆనుకుని ఆదివారం జరిగే సంత. దీనికి ఉద్దానం ప్రాంతంలో ఎంతో ప్రాధాన్యం ఉంది. వందేళ్ల చరిత్ర ఉన్న ఈ ఆదివారం సంత విశేషాలపై కథనం..

- నేటికి దానిపైనే ఆధారపడుతున్న ఉద్దానం ప్రజలు
- సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న వ్యాపారులు
- శనివారం సాయంత్రం నుంచి తాత్కాలిక షెడ్ల ఏర్పాటు

కంచిలి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కంచిలి మండలం మఖరాంపురం సమీపంలో జాతీయ రహదారికి ఆనుకుని ప్రతీ ఆదివారం సంత జరుగుతుంది. వంద సంవత్సరాలుగా నిరాటంకంగా ఇక్కడ సంత కొనసాగుతుండడం విశేషం. కంచిలి, కవిటి ఉద్దానం ప్రాంతాలకు చెందిన 70 గ్రామాల ప్రజలు తమకు కావాల్సిన నిత్యావసరాల కోసం ఆదివారం సంతపై ఆధారపడుతుంటారు. శనివారం రాత్రి నుంచే సంత జరిగే ప్రదేశానికి సుదూర ప్రాంతాల నుంచి వ్యాపారులు చేరుకుని తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకుంటారు. గుండు సూది నుంచి ప్రతి ఇంటికి కావాల్సిన నిత్యావసర సరుకులు ఇక్కడ లభిస్తాయి. ముఖ్యంగా ఉద్దానంలో కొబ్బరి, ఇతర వస్తువులను సంతకు తెచ్చి విక్రయిస్తుంటారు. ఆవులు, గేదెలకు అవసరమైన తవుడుతోపాటు కొబ్బరి పీచుతో తయారు చేసిన కన్నెలు అమ్ముతూ వచ్చిన ఆదాయంతో నిత్యావసరాలను కొనుగోలు తీసుకుని వెళ్తుంటారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది కుటుంబాలకు ఆదాయం ఈ సంత సమకూరుస్తోంది. రవాణా, ఇతర మార్గాల ద్వారా సైతం ఎంతో మందికి ఉపాధి కల్పిస్తోంది. సంతలో సరుకులు విక్రయించేందుకు సోంపేట, పలాస ప్రాంతాల నుంచే కాకుండా ఒడిశా నుంచి వ్యాపారులు వస్తారు. గతంలో వీరంతా ఎండ్ల బండ్లపై సరుకులు తెచ్చి విక్రయాలు జరిపేవారు. ప్రస్తుతం శనివారం సాయంత్రం నుంచే లగేజీ వ్యాన్లు, ఆటోలలో సరుకులు తెచ్చుకుని దుకాణాలు ఏర్పాటు చేస్తుండటం కనిపిస్తోంది. తమ తాత, తండ్రుల కాలం నుంచి సంతలో సరుకుల విక్రయిస్తున్నా మని వ్యాపారులు చెబుతున్నారు. ఇంటి ముందరకు ఆన్‌లైన్ వ్యాపారాలు వచ్చినా, ఊర్లలో సూపర్ మార్కెట్‌లు వెలిసినా.. సంతలో సరుకులు కొనుగోలు చేయడం ఈ ప్రాంత ప్రజలకు పరిపాటి. సంతల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తే అభివృద్ధి చెందుతుందని స్థానికులు చెబుతున్నారు.










ఆహార పదార్థాలదే అగ్రస్థానం..

ఆదివారం సంతలో అమ్మకాలు, కొనుగోళ్లు జరిపే వస్తువులలో ఆహార పదార్థాలదే అగ్రస్థానం. ముఖ్యంగా ఇంటికి అవసరమైన నిత్యావసరాలు, కిరాణాతోపాటు ఇళ్లల్లో వాడే గృహోపకరణాలు ఎక్కువగా దొరుకుతాయి. రైతులు పండించే దుంపలు, కూరగాయలతో పాటు చేతితో చేసే వస్తువులు లభిస్తాయి. రైతులకు సాగులో అవసరమైన పశు సంపదతోపాటు వ్యవసాయ పనిముట్లు కూడా ఇక్కడ ఉంటాయి. గతంలో సాంప్రదాయ వస్తువులకే వ్యాపారులు మొగ్గుచూపేవారు. ప్రస్తుతం ప్లాస్టిక్ వస్తువులు, ఇతర ప్రాంతాల్లో లభించే ప్రత్యేకమైన వాటిని కూడా విక్రయిస్తున్నారు. సూది మొదలుకుని కుటుంబ నిర్వహణకు అవసరమయ్యే అన్ని రకాల వస్తువులు లభిస్తున్నాయి. బ్రాండ్ కంపెనీలకు చెందిన జీన్స్, చిన్న పిల్లల డ్రెస్‌లు కూడా విక్రయిస్తుండటం కొసమెరుపు.



ప్రభుత్వం చేయూత అందిస్తే..

ఆదివారం సంత నిర్వహణకు ప్రభుత్వం చేయూత అందిస్తే వ్యాపారులకు, ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. వ్యాపారులు క్రయ, విక్రయాల కోసం శాశ్వత దుకాణాలు నిర్మించి, నామమాత్రపు రుసుము వసూలు చేస్తే బాగుంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. సామూహిక మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం కల్పించాలని వారు కోరుతున్నారు.



ల్యాండ్ మార్కుగా ప్రసిద్ధి..

గతంలో శ్రీకాకుళం నుంచి ఇచ్ఛాపురం వైపు వెళ్లే ఏ ప్రైవేటు బస్సు కండక్టర్‌కు అయినా ఆదివారం సంత అంటే టక్కున ఆ ప్రదేశంలోనే నిలుపుదల చేసేవారు. ఎక్కడైనా బస్సు ఆపాలంటే ఊరు అయి ఉండాలి. కానీ కంచిలి మండలంలోని ఆదివారం సంత ప్రాంతం మాత్రం ప్రత్యేక ల్యాండ్ మార్కుగా పేరుగాంచింది.

తాత, తండ్రుల కాలం నుంచి వ్యాపారం చేస్తున్నాం..

కంచిలిలోని ఆదివరం సంతలో సరుకులు విక్రయిస్తూ మా తాత, తండ్రులు జీవనం సాగించారు. ఇప్పటికీ వారి వారసత్వాన్నే కొనసాగిస్తున్నాం. ఊర్లలో ఎన్ని దుకాణాలు వెలసినా, ఆన్‌లైన్ మార్కెట్‌లు వచ్చినా సంతలో జరిగే వ్యాపారం అలాగే ఉంది.

-నాగరాజు, సోంపేట

ప్రజలు ఆదరిస్తున్నారు..

ఊర్లలో షాపులు ఉన్నా వారానికి ఒకసారి జరిగే సంతలో సరుకులు కొనుగోలు చేయడం ఉద్దానం ప్రాంత ప్రజలకు అలవాటు. వారు ఆదరిస్తున్నారు. అందుకే సంవత్సరాలుగా ఈ వ్యాపారం చేస్తూ ఉపాధి పొందుతున్నాం.

-పాపారావు సాహు, మఖరాంపురం


కె.కొత్తూరులో దీపోత్సవం

నేత్రపర్వంగా కార్తీక దీపోత్సవం

టెక్కలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): టెక్కలి మండలం కె.కొత్తూరు బాబా మందిర ప్రాంగణంలో గురువారం రాత్రి శివాభిషేక అర్చనతో పాటు కార్తీక దీపోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. వేలాదిమంది మహిళలు ఈ దీపోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పండి ఢిల్లేశ్వరరావు ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు బంకుపల్లి సురేష్, లమ్మత మధు, వాకాడ భుజంగరావు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను శతశాతం వసూలు చేయాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను శత శాతం వసూలు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం, ఆమదాలవలస మున్సిపల్ కమిషనర్లు, సిబ్బందితో గురువారం తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'మున్సిపాల్టీల ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను వెతకాలి. శ్రీకాకుళం నగర పరిధిలో ఖాళీ స్థలాల పన్ను రూ.5.71కోట్లు వసూలు చేయాల్సి ఉంది. నిర్లక్ష్యం వహిస్తే జీతాలను అటాచ్ చేస్తామ'ని హెచ్చరించారు. 'ఇచ్ఛాపురంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారి నుంచి గుడ్‌విల్ పన్నులు వసూలు చేయాలి. పలాసలో ఉన్న నాలుగు ఎకరాల ఖాళీ స్థలంలో పెద్ద షాపింగ్ కాంప్లెక్సు, కల్యాణ మండపాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలి. శ్రీకాకుళంలోని విజయాదిత్య పార్కులో పెద్ద పెద్ద హోర్డింగులను ఏర్పాటు చేయడానికి కార్పొరేట్ సంస్థలకు అవకాశం కల్పించాలి. ప్రతీ ఇంటి నుంచి చెత్త సేకరణలో కచ్చితత్వం పాటించి, చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలకు పంపించాలి. ఆమదాలవలస డంపింగ్ యార్డు నుంచి చెత్తను శ్రీకాకుళం డంపింగ్ యార్డుకు తరలించాల'ని కలెక్టర్ ఆదేశించారు.

పసిడి ధరలు పతనం

- వారంలో తులానికి రూ.5,200 తగ్గుదల
- ఆభరణాల బంగారం అయితే రూ.6,870..
- బులియన్ మార్కెట్‌లో ఒడిదుడుకులే కారణం!
- ధర తగ్గడంతో కళకళలాడుతున్న దుకాణాలు



నరసన్నపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బంగారం ధర వారం వరకు రోజురోజుకు పెరుగుతూ వచ్చింది. ఈనెల 8న తులం బంగారం రూ. 95,700 చేరింది. తులం రూ.లక్ష వరకు చేరుతుందని మదుపరులు, వ్యాపారులు అంచనా వేశారు. వచ్చే నెలలో పెళ్లిళ్ల సీజన్ కావడంతో కొందరు బంగారం ధరలు మరింత పెరుగుతాయని కొనుగోలు చేసారు. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ఔన్స్ ధరలు తగ్గడంతో.. దేశీయ మార్కెట్‌లో ధరలు తగ్గుముఖం పట్టాయి. తులం ధర రోజుకు రూ.500 నుంచి రూ. 700 వరకు తగ్గుతూ శుక్రవారం నాటికి రూ.89,400కి చేరింది. జిల్లాలో శ్రీకాకుళం, నరసన్నపేట, పలాస, సోంపేట, టెక్కలి, ఆమదాలవలస, పాతపట్నం, కొటబొమ్మాళి తదితర పట్టణంలో 600 పైగా బంగారం దుకాణాలు ఉన్నాయి. అత్యధికంగా బంగారం లావాదేవీలు నరసన్నపేట, శ్రీకాకుళంలో జరుగుతాయి. వారం రోజులుగా ధరలు తగ్గుతూ ఉండటంతో మదుపరులు బంగారం కొనుగోలు చేసేందుకు సుముఖత చూపుతున్నారు. అలాగే మార్గశిర మాసంలో పెళ్లిళ్లు ఉండటంతో ఆభరణాలు బెత్తాయింపులు చేస్తున్నారు. మరోవైపు వెండి ధరలు తగ్గలేదు. కిలో వెండి రూ.92వేల వద్ద స్థిరంగా ఉంది. ఇక 22 క్యారెట్లు బంగారం అంటే ఆభరణాల ధర గ్రాము రూ.6,870కు చేరింది. వారం క్రితం రూ.7,340 వరకు ఉండేంది. 22 క్యారెట్లు బంగారం ఆభరణాలు కొనుగోలు చేసేందుకు ఎక్కువమంది మొగ్గుచూపుతున్నారు. దీంతో బంగారం దుకాణాలు కళకళలాడుతున్నాయి.

పెరిగిన అమ్మకాలు...

నరసన్నపేట పట్టణంలో బంగారం ధరలు తగ్గుతుండటంతో రెండు రోజులుగా అమ్మకాలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో రోజుకు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు అమ్మకాలు జరగ్గా.. గత మూడు రోజుల నుంచి రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు జరుగుతున్నాయంటున్నారు. నరసన్నపేట పట్టణంలో చిన్నపెద్ద 150 వరకు షాపులు ఉంటాయి. వీటితోపాటు దేశీయంగా వ్యాపారం సాగించే హోల్‌సేల్ దుకాణాలు మూడు ఉన్నాయి. రానున్న రోజుల్లో బంగారం ధరలు తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు భావిస్తున్నారు. అయితే గత రెండు రోజులుగా షేర్ మార్కెట్లు పతనం కావడంతో బంగారం ధరలు పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

అసెంబ్లీలో మన ఎమ్మెల్యేలు

జీడి, కొబ్బరి బోర్డులు ఏర్పాటు చేయాలి..

- అసెంబ్లీలో ఎమ్మెల్యేలు గౌతు శిరీష, రవికుమార్


అసెంబ్లీలో మాట్లాడుతున్న గౌతు శిరీష, రవికుమార్

పలాస, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉద్దానం జీవనాడి జీడి, కొబ్బరికి మద్దతు ధరతో పాటు ఆయా బోర్డులను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఈ మేరకు గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆమెకు రెండోరోజు ప్రసంగించేందుకు అవకాశం రాగా ఉద్దానం జీడి, కొబ్బరి రైతుల సమస్యలను ప్రస్తావించారు. 2019-24 అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం జీడి, కొబ్బరి రైతులను ఆదుకోలేదని, అప్పటి వరకూ అమలవుతున్న టీడీపీ పథకాలకు మంగళం పాడిందని నామె గుర్తు చేశారు. ఉద్దానంలో జీడి, కొబ్బరి రైతులు తీవ్ర నష్టం చవిచూశారని, ముఖ్యంగా తితలీ తుఫాను వల్ల తీవ్రంగా నష్టపోయారని అన్నారు. 80 కిలోల జీడి పిక్కల బస్తాల ధర పడిపోవడంతో వైసీపీ హయాంలో కేవలం రూ.6వేలకు అమ్ముకోవాల్సి వచ్చిందని, అయితే జీడిపప్పు ధర మార్కెట్‌లో ఏమాత్రం తగ్గలేని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జీడి పిక్కల ధర రూ.14వేలకు పెరిగిందని, ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జీడి పిక్కల మద్దతు ధర, కొబ్బరి, జీడి బోర్డులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, దీన్ని అమలులోకి తీసుకువచ్చి ఉద్దానం రైతులను ఆదుకోవాలని ఆమె కోరారు.

- ఆమదాలవలస, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి బోర్డు ఏర్పాటు చేసి ఉద్దానం రైతులను ఆదుకోవాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. గురువారం శాసనసభలో ఉద్యానవన పంటలపై జరిగిన చర్చ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని సముద్ర తీర పరివాహక ప్రాంతమంతా జీడి, మామిడి, కొబ్బరి పంటలు అధికంగా పండిస్తున్నారని, ఐపీ మార్కెట్ ధరలకు.. రైతులకు అందించే ధరకు చాలా తేడా ఉండడంతో తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా కొబ్బరి రైతులను ఆదుకోవడానికి వ్యవసాయశాఖా మంత్రి చొరవ చూపి కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. మార్కెట్‌లో రూ.25 పలుకుతున్న కొబ్బరికాయ.. రైతులకు మాత్రం ఒక్కంటికి కేవలం 11 రూపాయలు అందుతున్నాయని అన్నారు.

సమ్మెకు సన్నద్ధం

(ఐదో పేజీ తరువాయి)

డీఎంహెచ్‌వోకు సమ్మె నోటీసులు ఇవ్వగా.. తాజాగా గురువారం ఎంపీడీవోలు, తహసీల్దార్లకు అందజేశారు. జిల్లావ్యాప్తంగా 108 అంబులెన్స్ వాహనాలు 31 ఉన్నాయి. 150 మంది ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు. ఒక్కో వాహనంలో ఇద్దరేసి డ్రైవర్లు, ఈఎంటీలు విధులు నిర్వహిస్తారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన సందర్భంలో 108 సర్వీసు ప్రొవెడర్లు కూడా మారుతున్నారు. నిర్వహణ బాధ్యతల నుంచి వైదొలుగుతున్న సదరు సంస్థలు 108 ఉద్యోగుల గ్రాట్యూటీ, ఆర్జిత సెలవులకు నగదు, వార్షిక ఇంక్రిమెంట్లు వంటివి చెల్లించడం లేదు. ఈ నేపథ్యంలో 108 వాహన సేవలను ప్రభుత్వమే నిర్వహించాలని, తమకు కూడా ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని ఉద్యోగులు, సిబ్బంది కొన్నాళ్లుగా డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని, పోస్టులు భర్తీ చేసేటప్పుడు ప్రాధాన్యత మార్కులు ఇవ్వాలని కోరుతున్నారు. '2017లో టీడీపీ ప్రభుత్వం జీవో నెంబరు 49 ద్వారా జీతంతో సంబంధం లేకుండా 108 సిబ్బందికి సీఎఫ్ఎంఎస్ ఖాతా ద్వారా ప్రతి నెలా రూ.4వేలు అదనంగా మంజూరు అయ్యేది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.4వేల అదనపు అలవెన్స్‌ను ఆపేశారు. వాటిని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించాల'ని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగే అన్యాయాన్ని సరిచేయాలని కోరుతూ.. 20 రోజుల నుంచి నిరసన చేపడుతున్నారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేకపోవడంతో ఈనెల 25 అర్ధరాత్రి నుంచి సమ్మె చేయాలని నిర్ణయించామని 108 వాహన సేవల కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు టి. విజయమోహన్, ప్రధాన కార్యదర్శి ఎస్. నాగభూషణ తెలిపారు. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా ఎంపీడీవోలు, తహసీల్దార్లకు గురువారం సమ్మె నోటీసులు అందజేశామన్నారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ వైద్యులకు కూడా సమ్మె నోటీసులు ఇచ్చామని తెలిపారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని మరోసారి విజ్ఞప్తి చేశామని వివరించారు.

జనంలోకి.. వన్యప్రాణులు

(ఐదో పేజీ తరువాయి)

ఏపీ, ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఉన్నా.. మెజార్టీ భూభాగం మాత్రం ఒడిశాలోనే ఉంది. అభివృద్ధి పేరిట కాలక్రమేణా మహేంద్ర గిరులు మసకబారుతున్నాయి. ముఖ్యంగా ఒడిశా ప్రభుత్వం మహేంద్రగిరులను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని సంకల్పించింది. రోడ్లు, రవాణా సౌకర్యం మెరుగుపరచింది. దీంతో దండకారణ్యాలు కాస్త చిట్టడవులుగా మారిపోతున్నాయి. మహేంద్రగిరుల్లో పచ్చని చెట్లపై గొడ్డలి వేటు పడుతోంది. టేకు, గంధం వంటి చెట్లు కనుమరుగై.. కలప అక్రమ రవాణా జరుగుతోంది. మహేంద్రగిరుల్లో భారీ గంజాయి వనాలతోపాటు సారా తయారీ కేంద్రాలు వెలుస్తున్నాయి. గతంలో ఒడిశా, ఏపీ అధికారులు సంయుక్త దాడులు నిర్వహించేవారు. కానీ ఇటీవల తగ్గుముఖం పట్టాయి.

తుఫాన్లతో పచ్చదనం కరువు..

హుద్ హుద్, తితలీ.. ఇలా ఏటా వరుస తుఫాన్లు జిల్లాను అతలాకుతలం చేశాయి. ఉద్దానం, మైదానం ప్రాంతంలో వందలాది చెట్లు నేలకొరిగాయి. కొబ్బరి, జీడి మామిడి తోటలు దారుణంగా నాశనమయ్యాయి. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో మొగలి డొంకలు పూర్తిగా కనుమరుగయ్యాయి. దీంతో ఎలుగుబంట్లు, అడవిపందులు తలదాచుకునేందుకు మార్గాలు లేకుండా పోయాయి. బయటకు వస్తున్న వన్యప్రాణులు మనుషులు తమకు ఎక్కడ హానీ తలపెడతారోనని ఎదురుదాడి చేస్తున్నాయి. ఈ క్రమంలో మనుషులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. వన్యప్రాణుల సంరక్షణతోపాటు వాటి బారి నుంచి ప్రజలను కాపాడేలా అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ఇవి చేయాలి..

సాధారణంగా నీరున్న ప్రాంతాల్లోనే వన్యప్రాణుల సంచారం అధికంగా ఉంటుంది. కానీ ఇటీవల అడవులు, కొండ ప్రాంతాల్లో నీరు లేకపోవడంతో వన్యప్రాణులు జనారణ్యంలోకి వస్తున్నాయి. అందుకే అడవులు, కొండ ప్రాంతాల్లో చెలమలు, చెక్ డ్యామ్‌లు, ఫైర్‌లైన్స్, సాసర్ పీట్లను ఏర్పాటు చేయాలి. నిఘా వలయాలు ఏర్పాటుచేస్తే వన్యప్రాణుల కదలికలను తెలుసుకోవచ్చు. వేటగాళ్లను నియంత్రించవచ్చు. సాసర్లు నిర్మించాలి. ఏటా వేసవిలో ట్యాంకర్లతో సాసర్లను నింపితే వన్యప్రాణుల దాహార్తిని తీర్చవచ్చు. సోలారు పంపుసెట్లు ఏర్పాటు చేస్తే దీనికి ఒక శాశ్వత పరిష్కార మార్గం చూపినట్టవుతుంది.

దృష్టి పెట్టాం..

జిల్లాలో వన్యప్రాణుల కదలికపై దృష్టి పెట్టాం. ఎక్కడైనా అటవీ జంతువులు, పక్షులు కనిపిస్తే సమాచారమందించాలి. వాటికి ఎటువంటి హాని తలపెట్టకూడదు. వాటి నుంచి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూస్తాం. జిల్లాలో వన్య ప్రాణుల సంరక్షణకు అనేక చర్యలు చేపడుతున్నాం.

-మురళీకృష్ణ, కాశీబుగ్గ ఫారెస్ట్ రేంజ్ అధికారి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జి.సిగడాం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ ఉపకేంద్రంలో 33/11 కేవీ లైన్ మరమ్మతులు చేపడుతున్న కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు శ్రీకాకుళం విద్యుత్‌శాఖ ఈఈ పి.యోగేశ్వరరావు, ఏఈ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోగల జి.సిగడాం, బాతువ, గెడ్డకంచరాం, నడిమివలస, జాడ, ఎందువపేట, శేతుభీమవరం, నిద్దాం, గోబ్బూరు, మదుపాం, వెలగాడ, చంద్రయ్యపేట, దేవరవలస, ఎస్‌పీఆర్ పురం, అద్వానంపేట, చెట్టుపొదిలాం తదితర గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు వినియోగదారులు సహకరించాలని కోరారు.

● ఎచ్చెర్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ధర్మవరం సబ్‌స్టేషన్ పరిధిలో ముద్దాడ ఫీడర్, ముద్దాడ, కమ్మవానిపేట, కొంగరాం, రుప్పపేట గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పి.యోగీశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు, ఇతర మరమ్మతుల కోసం సరఫరాను ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

నేడు విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10.00 గంటలకు విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్టు శాఖ ఏడీ కె.కవిత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతీ నెల మూడో శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు వినియోగించుకోవాలని కోరారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఇచ్ఛాపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పి.శాసనాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులకు కొళిగాం పీహెచ్‌సీ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, గ్రామ పెద్దలు కారంగి మోహన్‌రావు, ఎస్ఎంసీ ఛైర్‌పర్సన్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

రూ.75 వేల విరాళం

ఇచ్ఛాపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఈదుపురం గ్రామంలో నూతనంగా నిర్మాణం జరుగుతున్న రామాలయానికి అదే గ్రామానికి చెందిన ఉప్పాడ సోమేశ్వరరావు దంపతులు రూ.75 వేలు విరాళం అందించారు. ఈ మేరకు గురువారం ఆలయ కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉప్పాడ రాజారెడ్డి, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంక్రీట్ వాల్ నిర్మించాలి

ఎచ్చెర్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): చినకొంగరాం- ముద్దాడ గ్రామాల మధ్య ఊటగెడ్డ వద్ద కాంక్రీట్ వాల్, అప్రోచ్ రోడ్డు నిరించాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. ఈ రోడ్డు పనులు అసం పూర్తిగా ఉండడంతో వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. ఈ పనుల పూర్తికి తక్షణమే నిధులు విడుదల చేయాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సరుబుజ్జిలి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): 108 ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న తీరు దారుణమని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు విజయమోహన్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో తమ సిబ్బందితో కలిసి నల్లరిబ్బన్లు ధరించి నిరసనలు తెలిపారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చొరవచూపకపోవడంతో ఈ నెల 25 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్టు తెలిపారు. ఈ నిరసనలో ఉద్యోగులు వెంకటేష్, ఈశ్వర, మురళీ అమ్మినాయుడు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

17న బాలియాత్ర దీపోత్సవం

ఆమదాలవలస, నవంబర్ 14(ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో ఈ నెల 17వ తేదీ ఆదివారం బాలి యాత్ర దిపోత్సవం నిర్వహించనున్నట్టు ఉత్తరాంధ్ర కళింగ సామాజిక వర్గ గౌరవ అధ్యక్షుడు పేడాడ జనార్దనరావు తెలిపారు. గురువారం ఆయన ఆమదాలవలసలో విలేకరులతో మాట్లాడారు.

ప్రాచీన కళింగ సీమ సంప్రదాయమైన బాలియాత్రను కార్తీక పౌర్ణమి తదుపరి ఆదివారం పునః ప్రారంభం జరుగుతుందన్నారు. శ్రీముఖలింగేశ్వరుని దర్శనం అనంతరం వంశధార నదీతీరాన ఈ దీపోత్సవం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కంచరాన మురళీధర్, పూజారి భాస్కరరావు పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పొందూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పిల్లలవలస జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈ నెల 9 నుంచి 11 వరకు కృష్ణా జిల్లా పటమటలో జరిగిన అండర్-17 హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొన్న శ్రీకాకుళం జట్టులో జి.అఖిల, జి.సుస్మిత, ఎల్.పావని ప్రతిభ కనబరచడంతో శ్రీకాకుళం జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం ఎస్.కాసు లుబాబు, పీడీ రాజశేఖర్, ఉపాధ్యాయులు సిబ్బంది వాహన సిబ్బంది అబందరూ బాగున్నారు.

నగరంలో ట్రాఫిక్ నియంత్రణేదీ?

● కానరాని ట్రాఫిక్ పోలీసులు

● ఇబ్బందిపడుతున్న వాహనచోదకులు

శ్రీకాకుళం క్రైం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం శ్రీకాకుళం నగరంలో ట్రాఫిక్ నియంత్రణ పెద్ద సమస్య మారింది. నగరంలో అతివేగంగా తిరిగే వాహనదారులను నియంత్రించడంలో ట్రాఫిక్ పోలీసులు విఫలమవుతున్నారు. ప్రతీ కూడళ్లల్లో ఎస్ఐ స్థాయి అధికారితో పాటు ముగ్గురు పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నా.. ట్రాఫిక్ సమస్యను తీర్చలేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధాన కూడళ్లలో కొందరు ట్రాఫిక్ పోలీసులు తమ కష్ట సుఖాలు చెప్పుకునేందుకు ఇస్తున్న ప్రాధాన్యం ట్రాఫిక్ ని యంత్రణపై చూపించ డం లేదని వాహనదారు లు వాపోతున్నారు. నగ రంలో తరచూ రోడ్డు ప్ర మాదాలు జరుగుతున్నా.. అవి ఔట్ పోస్టు పోలీసుల నుంచి వివరాలు వచ్చే వరకు ట్రాఫిక్ పోలీసులకు సమాచారం తెలిసే పరిస్థితి లేదంటేనే ట్రాఫిక్ పోలీసుల పని తనం అర్థం చేసుకోవచ్చు. రెండు రోజుల కిందట నగరంలో ఏడు రోడ్ల కూడలిలో ఓ లారీ బ్రేక్‌డౌన్ కాగా రోడ్డుకు అడ్డంగా గంటల తరబడి ఉండిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. అలాగే మండల వీధి సమీపంలోని నీలమ్మ తల్లి ఆలయం వద్ద ఓ వాహనం సిమెంట్ మిల్లర్‌తో వస్తుండగా స్పీడ్ బ్రేకర్ వద్ద బోల్తా పడింది. దాని వెనుక నుంచి వస్తున్న ఓ కారు ఢీకొట్టింది. సుమారు అరగంట పాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఇంత జరిగినా ట్రాఫిక్ పోలీసులు అక్కడికి రాకపోవడం వారి పనితనానికి అద్దం పడుతుంది.

ఇప్పటికైనా జిల్లా పోలీసు బాస్ ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించాలని నగరవాసులు కోరుతున్నారు.



సిమెంట్ మిల్లర్‌ను ఢీకొట్టిన కారు



ఏడురోడ్ల కూడలిలో నిలిచిపోయిన ఓ లారీ

ఈ విషయాన్ని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా.. నగరంలో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. నిత్యమూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించాం. ఆయా చోట్ల ప్రమాదాల నియంత్రణపై నగర పాలక సంస్థ అధికారులతో కలిసి కార్యాచరణ రూపొందించామని తెలిపారు.

రామతీర్థం జంక్షన్ వద్ద..

రణస్థలం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిత్యం రద్దీగా ఉండే రామతీర్థ జంక్షన్ వద్ద ఏదో ఒక ప్రమాదం జరగడం పరిపాటిగా మారింది. అయితే రామతీర్థం జంక్షన్ వద్ద ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, వ్యాపారులు కోరుతున్నారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల సమయంలో వేలాది మంది విద్యార్థులు చదువుల కోసం పాఠశాలలకు, కళాశాలకు రోడ్డు దాటి వెళ్తుంటారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ జనాలతో ఈ జంక్షన్ రద్దీగా ఉంటుంది. ఏపీ మోడల్ స్కూల్, జడ్పీ హైస్కూల్, ప్రభుత్వ కళాశాల, ఎస్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు ఈ జంక్షన్ దాటి వెళ్లాల్సి ఉంది. అదేవిధంగా కూరగాయల మార్కెట్ ఈ జంక్షన్‌కు సమీపానే ఉండడంతో సాయంత్రం అయితే విపరీతమైన రద్దీగా ఉంటుంది. జాతీయ రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో రోడ్డు దాటడం చాలా కష్టమవుతోంది. ఈ క్రమంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అందవల్ల ఈ జంక్షన్ వద్ద ట్రాఫిక్ పోలీస్ ఏర్పాటు చేస్తే ప్రమాదాలు తగ్గుతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్ కానిస్టేబుళ్లను ఏర్పాటు చేయాలని కోరారుతున్నారు.



నిత్యమూ రద్దీగా ఉన్న రామతీర్థం జంక్షన్

సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలి

రణస్థలం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) గ్రామాల్లో సమస్యలు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకురావాలని అసిస్టెంట్ కమీషనర్ కృష్ణమోహన్ అన్నారు. గురువారం ఎంపీడీవో సమావేశపు మందిరంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామాల అభివృద్ధికి ఉపయోగించలన్నారు. ప్రత్యేక ఆహ్వానితుడు పిన్నింటి సాయికుమార్, జడ్పీటీసీ టొంపల సీతారాముడు, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు పాల్గొన్నారు.

తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్లుగా జిల్లా వాసులు

శ్రీకాకుళం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తూర్పు కార్పొరేషన్‌కు డైరెక్టర్లుగా శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఇద్దరిని ప్రభుత్వం నియ మించింది. కొత్తూరు మండల టీడీపీ నాయకులు పాత్రుకొండ మోహనరావును, అలాగే శ్రీకాకుళం జిల్లా జనసేన అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్‌ను నియమిస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులను విడుదల చేశారు.



మోహనరావు



చంద్రమోహన్

ప్రకృతి వ్యవసాయం మరింత విస్తరించాలి: కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తరింప చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. పంటల సాగు, ఉత్పత్తుల విస్తీర్ణం, ఆదాయం మరింత పెరగాలని సంబంధిత జిల్లా అధికా రులతో గురువారం కలెక్టరేట్‌లో నిర్వ హించిన సమావేశంలో ఆయన ఆదే శించారు. ఆర్గానిక్ ఉత్పత్తులపై ప్రజ లకు మరింత అవగాహన అవసర మని, ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపేలా రైతులను ప్రోత్స హించాలన్నారు. సమావేశంలో ఉద్యానవన అధి కారి వరప్రసాద్, వ్యవసాయాధికారి త్రినాథ స్వామి, మార్కెటింగ్ ఏడీ రవికుమార్, రైతులు, వ్యాపారులు పాల్గొన్నారు. అలాగే స్వీప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కొమ్ము రమణమూర్తి ఆధ్వర్యంలో జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ పర్యవేక్షణలో బాలల హక్కుల వారోత్స వాల పోస్టర్‌ను కలెక్టర్ గురువారం ఆవిష్కరిం చారు. కార్యక్రమంలో సురంగి మోహనరావు, వావిలప ల్లి జగన్నాథం, చింతాడ కృష్ణమోహన్, జామి భీమశంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్

బాలలహక్కులు హరిస్తే కఠినచర్యలు

పొందూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను హరిస్తే కఠినచర్యలు తప్పవని పొందూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి బి.జ్యోత్స్న అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం పొందూరు ఎంపీపీ-1 పాఠశాలలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో పాల్గొని మాట్లాడారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం కె.విజయకుమార్, బార్ అసోసియేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి జోత్స్న

● అరసవల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో గురువారం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు కృష్ణారావు

క్రీడలపై ఆసక్తి పెంచాలి

ఎచ్చెర్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కనబరిచాలని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ సంయుక్త కార్యదర్శి, ఏఎంవో ఎన్.సంజీవరావు అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో గురువారం జోన్-1 బాలికల గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా ప్రయోజనం ఉంటుందన్నారు. నాలుగు రోజులు పాటు జరగనున్న ఈ పోటీల్లో ఉమ్మడి మూడు జిల్లాల నుంచి 21 గురుకుల పాఠశాల/కళాశాలలల నుంచి 800 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. 6 గేమ్స్, 11 స్పోర్ట్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో డీఈవో ఎస్.తిరుమల చైతన్య, ఇంటర్మీడియట్ విద్య ఆర్ఐవో పి.దుర్గారావు, డీవీఈవో ఎస్.తవిటినాయుడు, ఎన్‌వైకే కోఆర్డినేటర్ ఉజ్వల్, డీటీవో నారాయణరావు, గురుకుల విద్యాలయాల జిల్లా సమన్వయకర్త బాలాజీ నాయక్, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ, వైస్ ప్రిన్సిపాల్ జ్యోతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

రైతులకు ఉపయుక్తంగా సహకార సంఘాల సేవలు

అరసవల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సహకార వ్యవస్థలో చిన్న, సన్నకారు రైతులకు, పేదవారికి సహకార సంఘాలు విజయవంతంగా సేవలందిస్తున్నాయని జాయింట్ కలెక్ట ర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా మొదటి రోజు నగరంలోని డీసీసీబీ బ్యాంకు ఆవరణలో సహకార పతాకాన్ని ఆయన ఎగురవేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. సంఘాలు పూర్తిగా కంప్యూటరైజేషన్ జరిగి గ్రామస్థాయిలో నుంచి దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో జాతీయ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేస్తున్నారన్నారు. డీసీసీబీ సీఈవో వరప్రసాద్, జిల్లా సహకార అధికారి బి.నగేష్ పాల్గొన్నారు.

సేవలు ప్రశంసనీయం

శ్రీకాకుళం క్రైం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి అమ్మవారి ఉత్సవాలల్లో పోలీస్ సిబ్బందితో పాటు స్వచ్ఛందంగా సేవలు అందించిన హిందుస్థాన్ స్కౌట్స్ సీఐ ఇమ్మాన్యుయల్ రాజు, జిల్లా ఆర్గనైజర్ కమిషనర్ కె.నాగేంద్ర, కమిషనర్ ఎం.జగదీశ్వరరావు తదితరులు ఉన్నారు.

సభ్యత్వ నమోదు చేయాలి

అరసవల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సభ్యత్వ నమోదు పెరిగేలా చూడాలని నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి పేర్కొన్నారు. స్థానిక ఏడురోడ్ల కూడలి, పాత బస్టాండు వద్ద సభ్యత్వ నమోదు కేంద్రాలను ప్రారంభించారు.

అవగాహన కలిగి ఉండాలి

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెలువడే తడి చెత్తను ఇంట్లోనే ఎరువు తయారు చేసుకోవడంపై అవగాహన ఉండాలని నగరపాలక కమిషనర్ ప్రసాదరావు అన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్-2024 కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలో ఇంట్లోనే ఎరువు తయారు చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

అరసవల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యవర్గసభ్యులు బి.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని అంబేడ్కర్ కూడలి వద్ద ప్రజాపోరు కార్యక్రమం నిర్వహించారు. రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్తు స్మార్ట్ మీటర్ల బిగింపు తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.మోహనరావు, పి.తేజేశ్వరరావు, జి.సింహాచలం, అమ్మన్నాయుడు, పోలాకి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● సోంపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రైతులు, ప్రజలపాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్‌మీటర్ల బిగింపును వెంటనే నిలుపుదల చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సంగారు లక్ష్మీనారాయణ కోరారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో దున్న యామయ్య, డి.కృష్ణారావు, కె.సింహాచలం, టి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

● ఎచ్చెర్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ భారాన్ని మోపితే ఉద్యమిస్తామని సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు పి.తేజేశ్వరరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎచ్చెర్లలో సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు టి.బంగార్రాజు, టి.రామారావు, హమాలీ యూనియన్ నేతలు ఎం.సురేష్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో పనిచేస్తున్న శానిటరీ మేస్త్రీలను విధుల్లోకి తీసుకోవాలని లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని మున్సిపల్ యూనియన్ నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు గురువారం శానిటరీ మేస్త్రీలు, పారిశుధ్య కార్మికులు రెండో రోజు వంట వార్పు నిర్వహించి నిరసన తెలిపారు. తొలగించిన ముగ్గురు శానిటరీ మేస్త్రీలైన పెదాలపు మోహన్‌కృష్ణ, అల్లు ఉపేంద్ర, పెసల రాము లను విధుల్లోకి తీసుకోవాలి కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతివావు, ప్రధాన కార్యదర్శి కల్యాణి, అప్పలరాజు అధ్యక్షుడు కె.వేణుగోపాల్‌రావు, ముద్దాడ రామారావు, అల్లు రవి తదితరులు పాల్గొన్నారు



నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

నిధులు లేకుంటే అభివృద్ధి ఎలా?

జి.సిగడాం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నిధులు లేకుండా గ్రామాల అభివృద్ధి చేయడం ఎలా అంటూ పలువురు సర్పంచ్‌లు అధికారులను నిలదీశారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక సమావేశంలో నిర్వహించారు. అప్పులు చేసి పారిశుధ్య పనులు, క్లోరినేషన్ వంటి పనులు చేపట్టాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

వినియోగించుకోవాలి

జి.సిగడాం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆధార్ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జి.రామకృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఎంఈవోలు రవి, శ్రీనివాసరావు ఉన్నారు.

ఏఎస్ఐ కుమారుడికి కారుణ్య నియామకం

శ్రీకాకుళం క్రైం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కవిటి పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తూ గతేడాది అనారోగ్యంతో మరణించిన డి.భాస్కరరావు కుమారుడు సాయి రాముకి విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం కల్పిస్తూ ఎస్పీ మహేశ్వరరెడ్డి గురువారం కారుణ్య నియామక పత్రాన్ని అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మహేశ్వరరెడ్డిని మరణించిన ఏఎస్ఐ కుటుంబ సభ్యులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పోలీసు శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పోలీసు కార్యాలయ ఏవో సీహెచ్ గోపీనాథ్, సీసీ బీవీ శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

హరిబాబునాయుడు ఆదర్శనీయం

రణస్థలం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ సీనియర్ నాయకుడు గొర్లె హరిబాబునాయడు నేటి తరానికి ఆదర్శనీయమని మాజీ ఎంపీపీ డీజీఎం ఆనందరావు, నడుకుదిటి తేజాబాబు అన్నారు. హరిబాబునాయుడు జయంతి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పిసిని జగన్నాథం నాయడు, గొర్లె లక్ష్మణరావు, గొర్లె సాయి, ముక్కు ఆదినారాయణ, దాసరిబలరామ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

లావేరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాల పై గురువారం తామాడ మోడల్ స్కూల్ విద్యార్థులకు లావేరు ఎస్ఐ జి.లక్ష్మణరావు అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో యువత సత్ ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రిన్సిపాల్ దేనియల్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, తామాడ మాజీ సర్పంచ్ గొర్లె శ్రీనివాసరావు, మహిళా పోలీస్ లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి దోహదం

గుజరాతిపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విద్యార్థుల ఉన్నతికి దోహదపడతాయని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి ప్రిన్సిపాల్ కె.శివశంకర్ అన్నారు. గురువారం కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలతోపాటు బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్, నెహ్రూ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, ఎస్ఎస్ఎస్ పీవో ఎల్.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



రంగనాథన్, నెహ్రూ చిత్ర పటాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

24 మంది ప్రాబబుల్స్‌తో క్రికెట్ జట్టు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబర్ (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పురుషుల కళాశాల మైదానంలో అండర్-12 బాలుర క్రికెట్ జట్టు ఎంపికలు గురువారం జరిగాయి. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా 49 మంది క్రీడాకారులు పాల్గొనగా, అందులో 24 మంది ప్రాబబుల్స్ జట్టును ఎంపిక చేశారు. వీరికి 20 రోజుల పాటు ప్రాక్టీస్, మ్యాచ్‌లను నిర్వహించి అందులో 15 మందిని తుది జట్టుకు ఎంపిక చేయనున్నట్టు ఆ సంఘం మెంటార్ ఇలియాస్ మహ్మద్ తెలియజేశారు. ఎంపికైన వారు అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

ప్రజా పోరు ప్రారంభం

రణస్థలం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) విద్యుత్ ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ అమ్మన్నాయుడు, వెలమల రమన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రం రామతీర్థం జంక్షన్ వద్ద ప్రజా పోరు ప్రారంభించారు.

ప్రజా సమస్యలపై దృష్టిసారించాలి

సరుబుజ్జిలి, నవంబర్ 14(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ద్వారా ప్రజల చేత ఎన్నుకోబడిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ప్రజా సమస్యలపై దృష్టిసారించాలని ఎంపీడీవో ఎం.పావని కోరారు. గురువారం సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు, కార్యదర్శులకు జీడీపీడీపై శిక్షణ ఇచ్చారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

జిల్లాలో గురువారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు.నందిగాం మండలంలోని మద్దిలివానిపేట వద్ద జాతీయరహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మహిళ,ఎచ్చెర్ల మండలం జరజాం సమీపంలో గల బైపాస్ ఎన్‌హెచ్‌పై జరిగిన ప్రమాదంతో లారీ డ్రైవర్ మృతిచెందాడు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ..

నందిగాం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దిలివానిపేట సమీప జాతీయరహదారిపై గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అదే గ్రామానికి చెందిన కోళ్ల రాజులమ్మ(50) దుర్మరణం పాలైంది. గ్రామస్థులు, పోలీసుల కథనం మేరకు... రాజులమ్మ రోజువారీ మాదిరిగానే గురువారం టెక్కలిలో జీడిపరిశ్రమలో పనిచేయడానికి వెళ్లింది. తిరిగి బస్సు దిగి గ్రామానికి వచ్చే క్రమంలో రహదారి దాటుతుండగా పలాస నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రాజులమ్మకు అక్కడికక్కడే మృతిచెందింది. భర్త గోపాల్, వివాహిత అయిన ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. గోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్ఐ షేక్‌మహ్మద్ ఆలీ కేసు నమోదుచేశారు.

కంటైనర్‌ను ఢీకొట్టడంతో లారీ డ్రైవర్..

ఎచ్చెర్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జరజాం గ్రామానికి సమీపాన బైపాస్ జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంతో లారీ డ్రైవర్ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు... విశాఖ నుంచి కోల్‌కత్తాకు గుడ్ల లోడ్‌తో వెళ్తున్న లారీ, ముందు వెళ్తున్న కంటైనర్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మహారాష్ట్ర ముసిరాబాద్‌కు చెందిన లారీ డ్రైవర్ నేపాల్ నంది (34) తీవ్రంగా గాయపడి.. శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. లారీ క్లీనర్ రాజు గాయపడ్డాడు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్..

సంతబొమ్మాళి,నవంబరు14(ఆంధ్రజ్యోతి):మండల హౌసింగ్ ఇన్‌స్పెక్టర్ దుంపల వాసు(52) గురువారం మృతిచెందారు. ఇటీవల గుండెలో నొప్పిరావడంలో శ్రీకాకుళంలోని ఓ ఆసుపత్రిలో చేర్చగా చికిత్సపొందుతూ మృతిచెందారు. ఆయన మృతి పట్ల మండల హౌసింగ్ ఏఈ నర్సింగరావు, తదితరులు సంతాపం తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

హరిపురం, నవంబరు14 (ఆంధ్రజ్యోతి):మందస మండలంలోని సియాలుట్టి గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని సవర పల్లవి గడ్డిమందు తాగి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. టెక్కలిలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న పల్లవి ఇంటికి వచ్చింది. తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డితాగింది. అపస్మారక స్థితిలో పడిఉన్న పల్లవిని పక్క ఇంటివారు గమనించి పలాసప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించారు. కాగా తల్లిదండ్రులు పోలీసులు ఫిర్యాదు చేశారు.

కొల్లివలసలో చెరకు పంట దగ్ధం

పోలాకి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తలసముద్రం పంచాయతీ పరిధిలోని కొల్లివలసలో గురువారం సాయంత్రం చెరకు పంట అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యింది. కరెంట్‌తీగలు తగిలి అగ్నిప్రమాదం జరిగినట్లు బాధిత రైతు బైరి గోవిందరావు తెలిపాడు. సుమారు ఆరెకరాలపైచిలుకు పంట అగ్నికి బూడిదైందని చెప్పాడు. ఏవో చిరంజీవికి, తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు సమాచారం అందచేశామని తెలిపాడు.

20 లీటర్ల సారా స్వాధీనం

సోంపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.బేబీ తెలిపారు. కంచిలి మండలం ఎస్ఆర్‌సీపురం వద్ద 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఎన్.జ్యోతి, పార్వతితోపాటు మద్యంతో కె.వినోద్‌కుమార్‌ను అరెస్టుచేసినట్లు చెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఎచ్చెర్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తోటపాలెం జగనన్న కాలనీ సమీపంలో పేకాటాడుతున్న ఆరుగురువ్యక్తులను అరెస్టు చేసినట్టు గురువారం ఎస్ఐ వి.సందీప్ కుమార్ తెలిపారు. వీరి నుంచి రూ.14,600, ఆరు మొబైల్ ఫోన్లు, నాలుగు మోటారు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

నరసన్నపేటలో అక్రమ నిర్మాణాలు నిలిపివేత

నరసన్నపేట, నవంబరు14(ఆంధ్రజ్యోతి): పట్టణంలో లక్ష్మీథియేటర్ సమీపంలో గల మెయిన్‌రోడ్డుపై ఆర్‌అండ్‌బీస్థలంలో నిర్మాణాలను గురువారం రెవెన్యూ పంచాయతీ అధికారులు నిలిపివేశారు. ఇక్కడ గత ప్రభుత్వం హయంలో రెవెన్యూ అధికారులు భవనాలను నేలమట్టంచేసిన విషయం విదితమే.అయితే ప్రస్తుతం రెండురోజులుగా షెడ్లు నిర్మిస్తుండడంతో పంచాయతీ, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఆ స్థలం ఆర్‌అండ్‌బీ ఆధీనంలోఉందని, తదుపరిఆదేశాలు వచ్చేవరకు నిర్మాణాలు చేయరాదని ఈవో ద్రాక్షాయిణి, ఆర్ఐ సాయిరాంనిర్మాణదారులకు సూచించారు.గత ప్రభుత్వహయంలో రాజకీయకక్షతో భవనాలను నేలమట్టంచేశారని, తమ స్థలం నిర్మాణాలు చేస్తున్నామని యాజమానులు వెంకటేశ్వరరావు, వైకుంఠరావు అధికారులకు తెలిపారు. ఉన్నతాధికారులు సమస్యను తెలియజేస్తామని, వారి సూచనలమేరకు ఆదేశాలొచ్చే వరకూ నిర్మాణాలు చేయరాదని అధికారులు సూచించారు.

ఐటీడీఏను పునరుద్ధరించాలి

పలాస, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):ఐటీడీఏ పక్క జిల్లా పరిధిలోకి వెళ్లిపోయినా గతపాలకులు పట్టించుకోలేదని, ఇప్పటికైనా పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలని టీడీపీ ఎస్టీసెల్ అధ్యక్షుడు సవర రాంబాబు ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో గిరిజనులకు ఐటీడీఏ లేకపోవడంపై అసెంబ్లీలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రస్తావించడంపై హర్షం వ్యక్తం చేశారు. సీతంపేటలోని ఐటీడీఏ జిల్లాకు మంజూరు చేయాలని కోరడం అభినందనీయమని తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు ఉర్లాం విద్యార్థి ఎంపిక

నరసన్నపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉర్లాం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కె.వినయ్‌కుమార్ స్కూల్ గేమ్స్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో వాలీబాల్‌లో ప్రతిభ కనపరిచి జాతీయస్థాయి పోటీలకు రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు హెచ్ఎం హర్షవర్ధన్ తెలిపారు. పాఠశాలకు చెందిన పదిమంది విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో వివిధ పోటీల్లో పాల్గొనగా వాలీబాల్‌లో బంగారు పతకం సాధించి జాతీయ జట్టుకు కెప్టెన్‌గా వినయ్‌కుమార్ ఎంపికయ్యాడని చెప్పారు.వినయ్‌తోపాటు రాష్ట్ర స్థాయి పోటీలకు పాల్గొన్న విద్యార్థులకు ఉపాధ్యాయులు అభినందించారు.

కబడ్డీ పోటీలకు లోహరిబంద విద్యార్థి..

హరిపురం, నవంబరు14 (ఆంధ్రజ్యోతి):లోహరిబంద హైస్కూల్‌లో చదువుతున్న గొల్లలపాలెంకు చెందిన మను యాదవ్ జాతీయ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడని తల్లిదండ్రులు చంద్రశేఖర్, రజినీ తెలిపారు. ఆయన్ను ఉపాధ్యాయులు, గ్రామస్థులు, టీడీపీ నాయకులు దాసరి తాతారావు, మధుబాబు అభినందించారు.

210 మందికి వైద్య పరీక్షలు

హరిపురం, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): మందస మండలంలోని భోగాపురంలో చక్కెర వ్యాధి దినోత్సవం పురస్కరించుకుని గురువారం హరిపురం కోస్టల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులు జనార్దన్ నాగసాయి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 210మందికి పరీక్షలు నిర్వహించి 96మందికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు బైరిశెట్టి గున్నయ్య, క్లబ్ ప్రతినిధులు లక్ష్మణరావు, వైఎన్ఎన్ మూర్తి, పుల్లా వాసు, బేసి గణపతి పాల్గొన్నారు.

● పలాస, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మధుమేహవ్యాధి నిర్ధారణ శిబిరాన్ని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా 96 మందికి షుగర్, బీపీ పరీక్షలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు హెచ్.ఎండుదొర, కార్యదర్శి టి.మాధవ రావు, కోశాధికారి ఎస్.అప్పారావు, టి.కృష్ణమూర్తి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.బాలకృష్ణయాదవ్, రామన్న, ఎన్.కోదండరామయ్య, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా మోహన్‌రావు

కొత్తూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండలాధ్యక్షుడు పొత్రకొండ మోహన్‌రావును తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తూర్పుకాపుల అభివృద్ధికి తోడ్పడతానని తెలిపారు.

శిథిల భవనం.. ఇరుకు గదులు

● భయాందోళన చెందుతున్న రోగులు, సిబ్బంది ● ఇదీ సరుబుజ్జిలి పీహెచ్‌సీలో పరిస్థితి


ఓ గదిలో పెచ్చులూడిన శ్లాబ్


ఇరుకుగదిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

సరుబుజ్జిలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో (పీహెచ్‌సీ) సమస్యలు తిష్ట వేశాయి. ప్రధానంగా ఇరుకు గదులు, శిథిలావస్థకు చేరిన భవనంలో సిబ్బంది బిక్కుబిక్కుమని విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడకు వస్తున్న రోగులు కూడా ఇబ్బందిపడుతున్నారు. 2000లో ప్రారంభించిన ఈ భవనం నిర్వహణ లేకపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఇటీవల శ్లాబ్ పెచ్చులూడి పడిపోయిన విషయం విదితమే. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. వైద్యులు సేవలందించే గది శ్లాబు పెచ్చులూడడంతో ఏ క్షణం కూలిపోతుందోనని భయాందోళన చెందుతున్నారు. భవనంలో పలు గదులు కారిపోతున్నాయి. వర్షం కురిస్తే సిబ్బందితోపాటు సామగ్రి తడిచిపోతున్నాయి. ప్రతిరోజూ ఇక్కడకు వంద నుంచి 150 మంది రోగులు వస్తున్నారు. రోగులకు సేవలందించే గది శిథిలావస్థలో ఉండడంతో సమావేశం గది ఇరుగ్గా ఉన్నా కొంతకాలం నుంచి రోగులకు అక్కడే పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో వైసీపీ హయాంలో రెడ్డీస్ ల్యాబ్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీలో రూ.60 లక్షలతో హంగులు కల్పించారు. అయితే అధికారులు, రెడ్డీస్ ల్యాబ్ ప్రతినిధులు భవన నిర్మాణ పటిష్టతను పరిశీలించకుండా రంగులు వేయడంతోపాటు సీలింగ్‌లు ఏర్పాటుచేశారు. వివిధ రకాల సామగ్రి సమకూర్చారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా పీహెచ్‌సీ భవనంలోని గదుల నుంచి ఏ సమయంలో పెచ్చులూడి రోగులపై పడుతాయోనని భయాందోళనతో సమావేశం గదిలో వైద్య సేవలందిస్తున్నట్లు వైద్యుడు సంతోష్‌కుమార్ తెలిపారు. భవనం పరిస్థితిని ఉన్నతాధికారులకు ఇప్పటికే తెలియజేశామని చెప్పారు.

అపార్ నమోదులో ఇబ్బంది లేకుండా చర్యలు: సీఈవో


నరసన్నపేట: ఆధార్ కేంద్రం పరిశీలిస్తున్న శ్రీధర్ రాజా

నరసన్నపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అపార్ నమోదులో విద్యార్థులకు ఇబ్బందిలేకుండా పాఠశాలలు, కళాశాలలు వద్ద ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసు కుంటున్నామని జడ్పీ సీఈవో కేవీఎన్ శ్రీధర్ రాజా తెలిపారు. గురువారం స్థానిక జూనియర్ కళాశాలలో మొబైల్ ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదనరావు, ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు, ప్రిన్సిపాల్ సత్యన్నారాయణపాల్గొన్నారు. తొలుత ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ నిర్మాణాలపై గృహ నిర్మాణశాఖ అధికారులతో సమీక్షించారు.

సీఎస్సీ ఆధార్ కేంద్రం పరిశీలన

పలాస రూరల్,నవంబరు14(ఆంధ్రజ్యోతి): పలాసలో నిర్వహిస్తున్న బీఎస్ఎన్ఎల్ సీఎస్సీ ఆధార్ కేంద్రాన్ని ఆర్డీవో గ్రంథి వెంకటేష్ గురువారం పరిశీలించారు. అపార్‌తో విద్యార్థుల వివరాల నమోదు, మార్పులు, చేర్పులపై నిర్వాహకులకు సూచనలుచేశారు. రోజుకు ఎన్ని నమోదవుతున్నాయి, నమోదులో ఇబ్బందులపై అడిగి తెలుసుకున్నారు.

నిబంధనలు సవరించాలి

కోటబొమ్మాళి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అపార్ నంబర్ జనరేట్ కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని హరిశ్చంద్రపురం ఎంపీటీసీ మాజీ సభ్యుడు హనుమంతు అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు హెడ్ మాస్టర్ ఇచ్చిన సర్టిఫికెట్ ప్రకారం ఆధార్‌లో మార్పులు చేసేలా నిబంధనలు సవరించాలని కోరారు. విద్యార్థులు 15 రోజుల నుంచి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారన్నారు.

గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి: ఎంపీడీవో


ఎల్.ఎన్.పేట: మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

జలుమూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు పాటుపడాలని ఎంపీడీవో కె.అప్పలనాయుడు కోరారు. గురువారం మండల పరిషత్ సమావేశభవనంలో జీపీడీపీపై శిక్షణ నిర్వహించారు. సమావేశంలో ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

●పలాస రూరల్,నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి సాధించేందుకు ప్రజాప్రతినిధులు సమగ్ర ప్రణాళికను అమలుచేయాలని ఎంపీపీ ఉంగ ప్రవీణ కోరారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో సర్పం చ్‌లు, ఎంపీటీసీలకు శిక్షణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వసంతకుమార్, ఈవో పీఆర్డీ మెట్ట వైకుంఠరావు, కార్యదర్శులు సద్గుణబాబు, ఆశాలత పాల్గొన్నారు.

● సంతబొమ్మాళి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కీలకపాత్ర పోషించాలని ఎంపీడీవో పి.జయంత్ ప్రసాద్ కోరారు. గురువారం సంతబొమ్మాళిలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లకు శిక్షణ నిర్వహించారు.

●హిరమండలం, నవంబరు14(ఆంధ్రజ్యోతి): స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధి యాక్షన్‌ప్లాన్ 2024-25లో భాగంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు గురువారం శిక్షణఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ తూలుగు మేనక, జడ్పీ టీసీ పి.బుచ్చిబాబు, ఎంపీడీవో కాళీప్రసాదరావు,యాళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

●నందిగాం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని ఎంపీడీవో టి.రాజారావు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాప్రతినిధులకు జీపీడీపీపైశిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, ఉపాధ్యక్షులు లక్ష్మీకాంతం, వసంతకుమార్ పాల్గొన్నారు.

● ఎల్.ఎన్.పేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రాధాన్యతా క్రమంలోనే అభివృద్ధిపనులు చేపట్టాలని ఎంపీడీవో పి. శ్రీనివాసరావు తెలిపారు. ఎల్.ఎన్.పేటలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు జీపీడీపీపై శిక్షణ నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ ఆర్. జ్యోతి లక్ష్మి, జడ్పీటీసీ త్రినాథులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

హరిపురం, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతుల సమస్యలు పరిష్కరించాలని పలాస నియోజకవర్గ రైతాంగ సమస్యల సాధన కమిటీ అధ్యక్షులు మామిడి మాధవరావు డిమాండ్ చేశారు. గురువారం హరిపురం మార్పు ట్రస్ట్‌భవనంలో ఏర్పాటుచేసిన రైతు సంఘ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ వర్షాలు లేకఎండిపోతున్న వరి పంటలకు బీమా కల్పించాలని కోరారు. కార్యక్రమంలోకొర్ల హేమారావు చౌదరి, నల్ల హడ్డీ, తామాడ త్రిలోచన, బెస్త కామేశ్వరరావు, లోకనాధం, కొమరవాసు, రామారావు, చిన్నారావు పాల్గొన్నారు.

పాఠశాలలో మౌలిక వసతులకు చర్యలు: ఆర్డీవో

మెళియాపుట్టి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి జడ్పీ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తెలిపారు. గురువారం పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల మౌలిక వసతులు లేవని విద్యా ర్థులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. మధ్యాహ్న భోజనం కట్టెలతో వండుతుండడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

మత్స్యకారులకు గుర్తింపు కార్డులు

వజ్రపుకొత్తూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి యోజన (ఎన్ఎఫ్‌డీపీ) పథకంకింద మత్స్యకారులకు అందజేస్తున్న గుర్తింపు కార్డులను సద్వినియోగం చేసుకోవాలని పలాస మత్స్యశాఖ అధికారి కొండ నాగరాజు ఒక ప్రకటనలో కోరారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మత్స్యకారుడు గుర్తింపు కార్డు పొందవచ్చని తెలిపారు. వివరాలకు మత్స్యశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

సొండి కుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

టెక్కలి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సొండి కులస్థులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని ఆ సంఘ నాయకులు కోరారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు గురువారం రాత్రి విజయవాడలో రాష్ట్ర సొండికుల సంఘ ప్రధానకార్యదర్శి సాహుకారి నాగేశ్వరరావు, కోశాధికారి రత్నాల శ్రీనివాసరావు, గజివెల్లి నాగభూషణం, గోవిందరావు, జగన్‌మోహన్, అప్పలరాజు, సంతోష్‌కుమార్ వినతిపత్రం అందజేశారు.

108 ఉద్యోగులు సమ్మెకు నోటీసు

సంతబొమ్మాళి, నవంబరు14(ఆంధ్రజ్యోతి): మండలంలో 108 వాహన సిబ్బంది వి.ఫల్గుణరావు, యు.అప్పలనాయుడు ఎంపీడీవో జయంతి ప్రసాద్, డీటీ నారాయణ రావుకు గురువారం సమ్మె నోటీసు అందజేశారు.సమస్య పరిష్కారం కోసం రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ఈనెల 25 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు పేర్కొన్నారు.

● నందిగాం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని ఈనెల 25 నుంచి సమ్మె నిర్వహించనున్నట్లు 108 సిబ్బంది బి.రాము, తారకేశ్వరరావు, ఎన్‌వీ రావు, టి.రాజేష్ తెలిపారు. తహసీల్దార్ పి.సోమేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు.

●జలుమూరు, నవంబరు 14: (ఆంధ్రజ్యోతి) అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 25 నుండి ప్రత్యక్ష సమ్మె చేస్తున్నట్లు 108 సిబ్బంది దుంపల మురళీధర్, గొలివి రామకృష్ణ తెలిపారు. ఎంపీడీవో కె.అప్పలనాయుడుకు వినతిపత్రం అందించారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి

పాతపట్నం నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని రొంపివలస లేఅవుట్‌లో గృహలబ్ధిదారులు కోరారు.గురువారం రొంపివలసలో లేఅవుట్‌లో గృహనిర్మాణాలను మండల ప్రత్యేకాధికారి మంచు కరుణాకరరావు పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో చంద్రకుమారి, జేఈ ఉదయ్‌భాస్కర్ ఉన్నారు.

నేడు బిర్సాముండా జయంతి

మెళియాపుట్టి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టిలో భారతీయ అటవీ జాతుల స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జయంతిని శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి తెలిపారు.ఈమేరకు గురువారం స్థానిక ఏకలవ్య పాఠశాల ఆవరణలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌లో పాల్గొనే అవకాశం ఉండడంతో, అందుకు అనుగుణంగా ఏర్పాట్లుచేస్తున్నట్లు తెలిపారు. అనంతరం నేలబొంతు ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు.కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కిరణ్, టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, ఏపీవో చిన్నాబుబు, డీడీ అన్నయ్యదొర, ఈఈ రమదేవి, డీఈ సిమ్మన్న పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టెక్కలి,నవంబరు14(ఆంధ్రజ్యోతి): భగవాన్‌పురం, చింతలగార, కె.కొత్తూరు, చాకిపల్లి, అక్కవరం, బొప్పాయిపురం ప్రాంతాల్లో టెక్కలి 11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కోఈఈ జి.శంకరరావు తెలిపారు. ఈ మేరకు విద్యుత్ వినియోగదారులు సహకరించాని కోరారు.

●నందిగాం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కొత్తగ్రహారం సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తగ్రహారం ఎంహెచ్, దేవుపురం ఫీడర్లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టెక్కలి ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు తెలిపారు. చెట్లకొమ్మలు నరకడం, మరమ్మతుల దృష్ట్యా కాపుతెంబూరు, పెద్దలవునిపల్లి, చిన్నలవునిపల్లి, కంచిపూరు పరిశ్రమలకు కరెంట్ సరఫరాకు అంతరాయంకలుగుతుందని పేర్కొన్నారు.

●హరిపురం, నవంబరు14 (ఆంధ్రజ్యోతి):మందస మండలంలోని హరిపురం సబ్‌స్టేషన్ పరిధిలో ఉద్దానం ఫీడరు, మందస సబ్‌స్టేషన్ పరిధిలో మేఘమాల ఫీడర్ల పరిధిలోతీగలపై చెట్లుకొట్టడం, మరమ్మతుల దృష్ట్యాశుక్రవారం విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ యగ్నేశ్వరరావు తెలిపారు.దీంతో బహాడపల్లి, నారాయణపురం బిడిమి, మఖరజోల, సువర్ణాపురం, చిన్నకోష్ఠ, పెద్దకోష్ఠ, తాళ్లగురంటి, సిరిపురంలో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

17న శ్రీముఖలింగంలో బాలియాత్ర

జలుమూరు, నవంబరు 14: (ఆంధ్రజ్యోతి) శ్రీముఖలింగంలో ఈనెల 17న చేపట్టనున్న బాలియాత్ర విజయవంతం చేయాలని కళింగరాజ్య ప్రతినిధులు పేడాడ తిలక్, డాక్టరు జీవితేశ్వరరావు కోరారు. గురువారం శ్రీముఖలింగం వద్ద వంశధారనదీ తీర ప్రాంతంలో బాలియాత్ర ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 17న మధ్యాహ్నం రెండు గంటలకు కళింగుల ప్రాచీన రాజధాని శ్రీముఖలింగంలో బాలియాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తమ్మన్నగారి సతీష్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

24,25 తేదీల్లో యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ

కాశీబుగ్గ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): హరిపురం జడ్పీ హైస్కూల్‌లో ఈనెల 24, 25 తేదీల్లో జరిగే జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ ఎన్నికల అధికారి, రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ తెలిపారు. గురువారం కాశీబుగ్గ జడ్పీ పాఠశాలలో యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశం అధ్యక్షుడు సిద్దు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం పలాస మండలం యూటీఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఢిల్లేశ్వరరావు, అధ్యక్షకార్యదర్శిగా జయరాం, కోశాధికారిగా శరత్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ చిట్టిబాబు, జిల్లా అకడమిక్ కమిటీ కన్వీనర్ ఎల్‌వీ వెంకటచలం, జగదీష్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

సంతబొమ్మాళి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ మండల కార్యవర్గం గురువారం ఎన్నుకున్నారు. సంఘ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా డి.పాపారావు,డి. గణపతిరావు, గౌరవాధ్యక్షుడిగా కె.ఆనందరావు, సహాధ్యక్షులుగా డి.పాల్గుణరావు, సీహెచ్ మాలతి, కోశాధికారిగా వై.సింహాచలం ఎన్నికయ్యారు.

ఆయాల వేతనాలు చెల్లించాలి

నరసన్నపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న తమ వేతనాలు చెల్లించాలని ఆయాలు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ వద్ద విద్యాశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఐదునెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో శశికళ, చిన్నమ్ముడు, నవీన, రాజేశ్వరి, లక్ష్మి, పద్మ, జయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి: పీవో


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

టెక్కలి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి కోరారు.గురువారంభీంపురం గిరిజనబాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు.ఈసందర్భంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, పాఠశాల టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉంచాలని ఇన్‌చార్జి హెచ్ఎం మహాలక్ష్మికి సూచించారు.

రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించాలి

టెక్కలి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంఅందించాలని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ అనూష తెలిపారు.గురువారం టెక్కలిలో వ్యవసాయశాఖ సిబ్బందితో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు బీవీ తిరుమలరావు, జిల్లా వనరుల కేంద్రం సంచాలకులు కె.కృష్ణారావు, ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త రాజశేఖర్, ఉద్యానవన అధికారి సునీత, మండల వ్యవసాయాధికారులు రంగారావు, గోవిందరావు, శ్రీకాంత్‌వర్మ, అప్పారావు, పినకాన అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

లింగాలవలసలో సత్యసాయి పల్లకి ఉత్సవం

జలుమూరు, నవంబరు 14: (ఆంధ్రజ్యోతి) మండలంలోని లింగాలవలసలో గురువారం సత్యసాయి పల్లకి ఉత్సవం నిర్వహించారు. సాయిబాబా 99వ జయంతి పురస్కరించుకొని కనుల పండగగా సత్యసాయి పల్లకి ఉత్సవం జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ దుంగ స్వామిబాబు, ఎన్ని లింగరాజు, పల్లకి సేవ జిల్లా కోఆర్డినేటరు అనాది గుప్త పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగించడం నిలిపివేయాలి

కొత్తూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతుల పాలిట ఉరితాళ్లగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపు తక్షణే నిలిపివేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నానిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నిమ్మక అప్పన్న రమేష్, దుర్గారావు, కృష్ణ, రామారావు పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే కేసులు

జలుమూరు, నవంబరు 14: (ఆంధ్రజ్యోతి) 18 ఏళ్ల లోపు వయసు గల బాలలను పనిలో పెడితే యజమానులపై కేసులు నమోదు చేస్తామని కార్మికశాఖ అధికారి వి.జయశంకర్ హెచ్చరించారు. చల్లవానిపేట కూడలిలో గల షాపులను గురువారం తనిఖీచేశారు.ఈసందర్భంగా బాల కార్మిక వ్యవస్థ, బాలల భద్రతపై షాపు యజమానులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లక్ష్మీనారాయణ, చైల్డ్ హెల్ప్‌లైన్ సూపరువైజరు ఎస్.వైకుంఠరావు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులు ఉండరాదు

ఎల్.ఎన్.పేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నీటిసంఘాలకు సంబంధించిన ఓటర్ల జాబితాలో రైతుల నుంచి ఫిర్యాదులకు తావు లేకుండా జాబితా ఉండాలని తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ తెలిపారు. గురువారం ఎల్.ఎన్.పేటలో ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో తప్పులు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఇరిగేషన్ ఏఈ శీనివాసరావు, ఆర్ఐ ఎస్.గవరయ్య పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

ఎల్.ఎన్.పేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం తాత్సారం కనబరుస్తోందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ రమణమూర్తి తెలిపారు.గురువారం లక్ష్మీనర్సుపేట జడ్పీ ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.ఉపాధ్యాయులకు సంబంధించిన ఇంతవరకు ఉన్న బకాయిలు చెల్లించాలని, పెండింగ్ డీఏలు, ఎరియర్లు, ఐఆర్‌పై స్పష్టమైన ప్రకటన కూటమిప్రభుత్వం చేయాలని కోరారు.సమస్యలు కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తుందనిఆశతో ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. సమావేశంలో ఎస్టీయూనాయకులు పి. రామకృష్ణ, బి.సత్యం పాల్గొన్నారు.

రోడ్డుపై తుప్పలు.. రాకపోకలకు బేజారు

● ఇదీ రొంపివలస- బైదలాపురం మార్గంలో పరిస్థితి


ఎన్.కొత్తూరు సమీపంలో బైదలాపురం వెళ్లే రహదారికి ఇరువైపులా దట్టంగా పెరిగిన పొదలు

పాతపట్నం నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపివలస నుంచి ఎన్.కొత్తూరు మీదుగా బైదలాపురం వెళ్లే రహదారికి ఇరువైపులా దట్టంగా తుప్పలు పెరగడంతో వాహనచోదకులు, రైతులు భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ముమ్మరంగా కోతలు జరుగుతుండడంతో పొలాల నుంచి పంటలను తీసుకొచ్చే రైతులు ఇబ్బందిపడుతున్నారు. దీనికితోడు చీకటిపడిన తర్వాత ఈ మార్గంలో వాహనచోదకులు ఎదురుగా వస్తున్న వాహనం కనిపించకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డులో అక్కడక్కడ ఉన్న మలుపుల వద్ద వాహన చోదకులు ఇబ్బందిపడుతున్నారు. ఈ నేపథ్యంలో జంగిల్ క్లియరెన్స్ చేయాలని రైతులు కోరుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడంలేదు.